క్లుప్తంగా

ఎయిడెడ్ సమస్యలపై ఏడీని కలిసిన ఏపీటీజీ నాయకులు

ఒంగోలు: ఎయిడెడ్ సమస్యలపై అసిస్టెంట్ డైరెక్టర్ సురేఖావాణిని ఏపీటీజీ నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. పదవీ విరమణ పొందిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఫైల్‌ను ఏజీ ఆఫీసుకు త్వరగా పంపాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పే ఫిక్సేషన్ బాధ్యతను జీవో నంబర్ 155 ప్రకారం మండల విద్యాశాఖ అధికారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఏడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకరరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి కుట్టుమిషన్ అందజేసిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: నగరానికి చెందిన రాగిణి పూర్ణిమ అనే దివ్యాంగురాలికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ప్రకాశం భవనంలో రూ.10 వేల విలువైన కుట్టుమిషన్ అందజేశారు. అందుకు అవసరమైన నిధులను దోస్తీ ఫౌండేషన్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ సమకూర్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తన జీవనోపాధి కోసం కుట్టుమిషన్ ఇప్పించాలని లబ్ధిదారు పూర్ణిమ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్.. తగిన చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీని ఆదేశించారు. దీంతో కార్పొరేషన్ డైరెక్టర్‌ను అధికారులు సంప్రదించగా కుట్టుమిషన్ ఏర్పాటు చేశారు. కలెక్టర్, అధికారులకు దివ్యాంగురాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ అర్చన, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంగారావు సేవలు అభినందనీయం



రంగారావు దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

చీమకుర్తి: సోషల్ స్కూలు అసిస్టెంట్ ఎస్.రంగారావు విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు పీఎస్‌జీ రంగారావు అన్నారు. బుధవారం గాడిపర్తివారిపాలెం జిల్లాపరిషత్ హైస్కూలులో రంగారావు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం రంగారావు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూడిదేల సుబ్బరామిరెడ్డి, పీఎస్ స్కూలు అసిస్టెంట్ వై.అప్పారావు, రత్నాకర్, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

4న విజయవాడలో గ్రామీణ వైద్యుల రాష్ట్ర మహాసభ

ఒంగోలు టౌన్: విజయవాడలోని అనుమోలు గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ సామాజిక వైద్య సహాయకుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవ రాష్ట్ర మహాసభ, క్యాన్సర్ అవగాహన సదస్సును ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బట్టు బాలాజీరావు, కె.బాలచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రముఖ వైద్యులు బ్రహ్మారెడ్డి, కేజీ గోవిందరెడ్డి, ఎం.గోపీచంద్, సంఘ రాష్ట్ర నాయకులు వీబీటీ రాజు, టి.రాధాకృష్ణ, టి.ప్రభాకరరావు, ఎంఎస్ రాజు, కృష్ణమూర్తి పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులంతా ఈ సభలలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడా సందడి



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి ఆటల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఒంగోలులోని మినీ స్టేడియంలో బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల నుంచి వచ్చిన వివిధ క్రీడా జట్లకు చెందిన క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కలెక్టర్ క్రీడాజ్యోతి అందజేయగా జిల్లా క్రీడలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమితులైన షేక్ ఇమామ్‌షా, జి.భక్తధృవుడు, మనోజ్‌సాయి వెలిగించారు. ముందుగా నగర మేయర్ గంగాడ సుజాత, జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డితో కలిసి జాతీయ పతాకం, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన క్రీడా పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఆయా క్రీడల్లో నైపుణ్యాలు ప్రదర్శించి సత్తాచాటి ఆకట్టుకున్నారు.

– ఒంగోలు



క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, తదితరులు



అంతర్జాతీయ క్రీడాకారులకు క్రీడా జ్యోతి అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత



గౌరవవందనం చేస్తున్న క్రీడాకారులు



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న యర్రగొండపాలెం - సంతనూతలపాడు నియోజకవర్గాల బాలుర జట్లు



ఆటల పోటీలను వీక్షిస్తున్న క్రీడాభిమానులు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న యర్రగొండపాలెం - కనిగిరి నియోజకవర్గాల బాలికల జట్లు



వాలీబాల్ మ్యాచ్‌లో తలపడుతున్న యర్రగొండపాలెం - కొండపి నియోజకవర్గాల బాలికల జట్లు

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

- మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. మంగళవారం రాత్రి చీమకుర్తిలోని డాక్టర్ బీ.జవహర్ ఆస్పత్రి ఆవరణలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాకార్యక్రమాల్లో మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా లయన్స్‌క్లబ్ తరఫున నిర్వాహకులు డాక్టర్ బీ.జవహర్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి సేవాకార్యక్రమాలను ఇంకా కొనసాగించాలని ప్రోత్సహించారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

అనంతరం కుష్టు వ్యాధి గ్రస్తులకు నూతన వస్త్రాలు, పలు పాఠశాలలకు స్కూలు గ్రాంట్‌లు, విద్యార్థులకు ట్యాబ్‌లు, పేద మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.జవహర్‌తో పాటు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృపానందం, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, చలువాది బదరీ నారాయణ, చలువాది రమేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.7.48 కోట్ల మిగులుతో
చీమకుర్తి మున్సిపాలిటీ బడ్జెట్

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.7.48 కోట్ల మిగులుతో అంచనా బడ్జెట్‌ను పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపరపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో బడ్జెట్ అంచనా రాబడి, వ్యయంపై చర్చించారు. ఈ ఏడాది ప్రారంభ నిల్వ రూ.7.19 కోట్లు కాగా, రెవెన్యూ ఆదాయం రూ.6.36 కోట్లు, మూల ధన ఆదాయం రూ.10.94 కోట్లతో కలిపి మొత్తం ఆదాయం రూ.24.25 కోట్లు చూపించారు. రెవెన్యూ వ్యయం, మూల ధన వ్యయం కలిపి రూ.16.77 కోట్లుగా చూపించారు. మొత్తం ఆదాయంలో వ్యయం మినహాయించగా రూ.7.48 కోట్ల మిగులు బడ్జెట్ అంచనాగా పాలకవర్గం చూపించారు. దాంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై ఆమోదం తెలిపారు. అనంతరం ప్రస్తుతం ఉన్న కమిషనర్ షేక్ ఫజులుల్లా బదిలీపై వెళ్లగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఈశ్వరరాజుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ప్రకృతి వ్యవసాయం సాగు బాగుంది



ప్రకృతి వ్యవసాయం సాగును పరిశీలిస్తున్న దక్షిణాఫ్రికా దేశ బృందం

- మండలంలో పర్యటించిన దక్షిణాఫ్రికా దేశం బృందం

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయం సాగు ఎంతో బాగుందని దక్షిణాఫ్రికా దేశం బృందం కొనియాడింది. మండలంలో ప్రకృతి వ్యవసాయంలో సాగులో ఉన్న పంట పొలాలను దక్షిణాఫ్రికా దేశ బృంద సభ్యులు ఈషాని, ధనియా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో ఈ బృందం పంటలను పరిశీలించింది. తొలుత కొత్తపట్నం గ్రామ సంఘం–6లో సామూహికంగా సాగుచేస్తున్న వరి పొలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాదర్తి చిన్న శ్రీనివాసులు, భవాని ప్రకృతి కషాయాలతో సాగుచేస్తున్న ఆకుకూరలు, కూరగాయల సాగును పరిశీలించారు. అక్కడే ఉన్న చిన్న వెంకటేశ్వరరెడ్డి వేరుశనగ సాగును, కట్టా యమున, మరో ఐదుగురు సాగు చేస్తున్న మిర్చి, వేరుశనగ, చామదుంప పైర్లను పరిశీలించారు. కొత్తపట్నంలో పురిణి మల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రంలో కషాయాల ద్రావణాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దశపర్ణి అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, కాషాయాలను పరిశీలించారు. ఇక్కడ ప్రకృతి వ్యవసాయం సాగు బాగుందని, మా దేశంలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రీజనల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, స్టేట్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ సారథులు.. వలంటీర్లు

- దేశానికే ఆదర్శం.. వలంటీర్ల వ్యవస్థ
- వలంటీర్ల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమ సారథులుగా వలంటీర్లు నిలిచారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో బుధవారం సాయంత్రం మండల వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా వలంటీర్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సేవాభావంతో, జగనన్నపై అభిమానంతో నిత్యం ప్రజల మధ్యే ఉంటూ మీకు కేటాయించిన కుటుంబాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, మీ రుణం తీర్చుకోలేనిదని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఒకటో తేదీ తెల్లారక ముందే తలుపుతట్టి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లను కించపరుస్తున్న నారా చంద్రబాబు నాయుడుకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వానొచ్చినా, వరదొచ్చినా, కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. అందుబాటులో లేని వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారికి సుదూర ప్రాంతం వెళ్లి పింఛన్‌లు అందజేయడం అభినందనీయమన్నారురు. రానున్న ఎన్నికల్లోనూ సైనికుల్లా పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, శివప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలుపించుకుందామని బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. వలంటీర్లు తెలిపిన సమస్యలపై స్పందిస్తూ పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వలంటీర్లకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా చీమకుర్తి, దర్శిలోని తమ ఇంటి తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కె.యుగకీర్తి, వైస్ ఎంపీపీ యిడమకంటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ చార్లెస్‌సర్జన్, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాసు, నాగలక్ష్మి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, గోళ్లపాటి మోషే, కోటా రామిరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఆదాం షరీఫ్, ఈఓఆర్డీ కేజీఎస్ రాజు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఆవుల రమణారెడ్డి ఆహ్వానం మేరకు విందుకు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో మద్దతిచ్చి గెలుపునకు సహకరించాలని శివప్రసాద్‌రెడ్డి కోరారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

'అమ్మ తలపులో' పుస్తకం ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: ప్రముఖ కవి డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు రచించిన 'అమ్మ తలపులో' పుస్తకావిష్కరణ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నరసం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసం గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ పుస్తకాన్ని ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ అమ్మ ఆది అంతం లేని గొప్ప ప్రేమ కావ్యమని, అనంతకోటి బ్రహ్మాండాలు అంతమైనా అంతంకాని ఓ సజీవ శక్తి అని కొనియాడారు. అలాంటి అమ్మ బహుముఖ రూపాలను భూసురపల్లి తన కవితల్లో అంతర్లీనంగా చక్కగా వర్ణించారన్నారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న కళా మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ అన్న భూసురపల్లి వెంకటేశ్వర్లు గతంలో రాసిన పన్నెండు పుస్తకాల కంటే కూడా 13వ పుస్తకం అత్యంత ప్రతిష్టాత్మకంగా రాశారని ప్రశంసించారు. 'అమ్మ తలపులో' పుస్తకాన్ని అమ్మలందరికీ అంకితం చేస్తున్నానని రచయిత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో మాగంట శ్రీనివాస్ మూర్తి, నరసం కోశాధికారి బీరం అరుణ, భూసురపల్లి విజయలక్ష్మి, పొన్నాడ ప్రదీప్తి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

మద్దిపాడు: యువతి పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిని మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. గాజులపాలేనికి చెందిన కన్నెగంటి సుబ్బారావు అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో ఉంటున్న యువతి ఇంట్లో ఒంటరిగా ఉండడం చూసి గోడ దూకి లోనికి ప్రవేశించాడు. ఈ క్రమంలో ఆ యువతి గట్టిగా కేకలు వేయగా సుబ్బారావు గోడ దూకి పారిపోయాడు. ఈక్రమంలో చుట్టుపక్కల వారు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. బుధవారం సదరు యువతి ఫిర్యాదు మేరకు సుబ్బారావును అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబద్ధత కలిగిన అధికారి.. మరియదాసు



మరియదాసును సన్మానిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలోని వివిధ విభాగాలలో 33 సంవత్సరాల పాటు నిబద్ధతగా విధులు నిర్వహించిన మరియదాసు సమర్థవంతుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. బుధవారం పదవీ విరమణ చేసిన స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.మరియదాసును జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖకు మరియదాసు అందించిన సేవలను ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అన్నీ ప్రభుత్వ శాఖలలో కంటే పోలీసు శాఖలో విధులు నిర్వహించడం భిన్నంగా ఉంటుందని, ప్రజలతో మమేకమై సేవలను అందించే అవకాశం పోలీసు ఉద్యోగులకే ఎక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగం చేస్తున్న ప్రతిఒక్కరూ పదవీ విరమణ చేయడం సహజమేనని, రిటైర్మెంట్ తర్వాత విశ్రాంత జీవితాన్ని గడపాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని మరియదాసును కోరారు. పదవీ విరమణ చేసినప్పటికీ మీరు పోలీసు కుటుంబంలో సభ్యులుగానే ఉంటారని, భవిష్యత్తులో ఎలాంటి సహకారం కావాలన్నా పోలీసు శాఖ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.